## చేసిన తప్పు భర్తకు తెలియకపోయినా ఆమె తనకుతాను విధించుకున్న శిక్ష?

# తప్పుకాని తప్పు




పర్వతాల మీద ధవళవస్త్రం కప్పుతున్నట్టుగా, పొగమంచు కమ్ముకుంటోంది. "మలయవనం" స్టేషన్లో, రైలు ఆగింది.

చిరుచీకట్లు కమ్ముకుంటున్న ఆ సమయంలో, ఎర తిన్న కొండచిలువలా కదలకుండా వుంది ఆ రైలు. పై స్టేషన్ "శివ శిఖరం" నుంచి ఇంకా క్లియరన్స్ దొరకలేదు.

"ఉస్సో"మని చేసే రైలు ధ్వని ఆ సమీప పర్వతాలలో ప్రతిధ్వనిస్తోంది.

'మలయవనం' స్టేషన్లో ముగ్గురు దిగారు. నాలుగు మైళ్ళ దూరంలో వుంది వూరు. ఊరు చిన్నది. కొండ ప్రాంతం కాబట్టి రవాణా సౌకర్యాలు లేవు. అందుకే వెనకబడి వుంది. వెనకబడి వుంది కాబట్టే రవాణా సౌకర్యాలు లేవా?

అలా రైళ్ళు గంటల తరబడి అక్కడ ఆగిపోవడం మామూలే. ఎక్స్‌ప్రెస్ రైళ్ళు లూప్ లైనులో దడదడలాడుతూ వెళ్ళిపోతాయి. ఆ తర్వాత ఆ స్టేషన్, వూరు, పర్వతాలు నిశ్శబ్ద సమాధిలోకి వెళ్ళిపోతాయి.

వసంతకాలంలో గాలి వీచినప్పుడు, జాగ్రత్తగా వింటే, సౌరాష్ట్ర రాగంలో "సావిరహే తవ దీనా కృష్ణే" అన్నపాట మనసుకు వినబడుతుంది— అడవి చెట్ల పాట అది.

అగ్నిగుండంలాంటి గ్రీష్మంలో, ధన్యాసి రాగంలో "బ్రోచేవారెవరురా" అన్న దీనాలాపనలూ వినవస్తాయి.

ఆ నిశ్శబ్దంలో అప్పుడు మేకలు గుంపులు చేసే "మే మే—" శబ్దాలు, గాలి పాడుకునే జాలి పాటలు, అడవి

పాడే హుషారు పాటలు, బాధాకరమైన రాగాలు, వానాకాలంలో అశ్రుగీతాలు వినపడతాయి— వినేవాళ్ళకు— మనసులో.

కళ్యాణి రోజూ నాలుగు మైళ్ళు నడిచి అక్కడకు వస్తుంది. అక్కడ ఆగే ఒకే ఒక్క పాసింజరు రైలు, సాయంత్రాలే వస్తుంది.

ఇద్దరి కోసం నిరీక్షిస్తూవుంటుంది.

శ్రీ కళ్యాణ్ —భర్త— నల్లటి వత్తయిన వంకీల జుట్టు, చిరునవ్వు నవ్వుతున్నట్టుగా, ఎప్పుడూ కనబడే పెదాలు— నవనీత హృదయం— తేనె మాట.

శివరామయ్య— తండ్రి— శిథిలమైన శరీరం, వంగిన నడుం. వదులు లాల్చీ, పాత చెప్పులు— చేతిన ఎప్పుడూ వుండే సంచి.

ఎన్నాళ్ళుగానో ఆ నిరీక్షణ—

కళ్యాణి మలయవనం కుగ్రామంలో పిల్లలకు పాఠాలు చెబుతూ బ్రతుకు వెళ్ళదీస్తూ వుంది...

ఈ రోజు రాలేదు— నిరాశగా ఓ నిట్టూర్పు విడిచింది. కళ్యాణి.

"మలయవనం" గ్రామానికి దారిపట్టింది.

ముందరున్న స్టేషన్లో క్లియరన్స్ ఇచ్చినట్టున్నారు. రైలొక్కసారిగా ఘూర్జిల్లి, "చుక్ చుక్" మంటూ బయలుదేరింది.

కొన్ని నిమిషాలలో కనుమరుగయింది.


పక్షులు గుంపులు, "క్రీ క్రీ" అని అరుస్తూ గూళ్ళకు చేరుకుంటున్నాయి.

తను చేసినది తప్పా!

ఆ తప్పు చేసిన సమయం— మొత్తం మూడు క్షణాలు— మూడే క్షణాలు. ఆలోచిస్తూవుంది కళ్యాణి.

శ్రీ కళ్యాణ్ తో తన పెళ్ళి మామూలుగా జరిగిపోయింది.

పెళ్ళి లాటరీ లాటిది. ఒకే ఒక్క రూపాయి టిక్కెట్టుతో లక్షాధికారిని చేసినట్టు, మామూలు పెళ్ళికొడుకు, కోదండ రాముడిలా తర్వాత తేలవచ్చు. వేలు పెట్టి కొన్నా ఒక్క ప్రైజు రానట్టు, ఎంతో ప్రయత్నించి చేసిన సంబంధం నీళ్ళ



కచికలా తుస్సుమని పోవచ్చు.

కళ్యాణికి లాటరీ వచ్చింది. వెలలేని లాటరీ. శ్రీ కళ్యాణ్ వంటి విశాల హృదయుడు దొరకడం కళ్యాణి అదృష్టం.

భావ కవిలా, ఏదో తనలో తనే పాడుకునే కళ్యాణి, ఆ రోజు కళ్యాణ్ ఇచ్చిన కానుక చూసి అప్రతిభురాలయింది.

''కళ్యాణీ! తంజావూరు వీణ! నీకే! నాకు తెలుసు నీకు సంగీతం ఇష్టమని. పందిరి ఆసరా ఇచ్చి, ఆదుకుంటే తీగమల్లెలు అల్లుకుపోగలవని నా విశ్వాసం. నీ కమ్మని పాట నీలో కూనిరాగంలా ఆరిపోకూడదు. ఆకు కనపడని మల్లెలతో నిండిన మల్లె మందిరిలా వికసించాలి. విస్తరించాలి. శాశ్వతమైన అనుభూతిని, ఆనందాన్ని, నాకు పంచాలి. నన్నూ, నిన్నూ ఇక్కడ, ఈ లోకంలో వుండనిచ్చినందుకు కృతజ్ఞతగా, ఈ లోకానికి నీ మధుర సంగీతాన్ని వినిపించాలి...''

కళ్యాణి సిగ్గుపడి అంది— ''నా కూని రాగాలు ఇంత కల్లోలం సృష్టిస్తాయంటే, నేను పాడకనేపోదును—''

''పెదవి దాటని నీ మనోనందనవపు, రాగహేల నా అంతఃకర్ణాలతో విన్నాను...'' అన్నాడు.

ఆ రోజునుంచి వీణ సాధన మొదలుపెట్టింది.

మొదటి నాలుగు రోజులలో, వీణంటే విసుగు పుట్టింది కళ్యాణికి.

గాలిని సృజించి, మలచి, మధుర నాదాన్నిచ్చే వీణేనా ఇది...

కర్ణకఠోరంగా కారు హారనులా మోగుతోందేం!

విషణ్ణ వదనంతో వున్న కళ్యాణిని చూసి శ్రీ కళ్యాణ్ అన్నాడు.

''ఏం కళ్యాణీ! ఈ వీణ వచ్చిన తర్వాత నీ సాధనతో కాలం హరించుకుపోయి, అలసట మిగులుస్తోందా?—''

శ్రీ కళ్యాణ్ మనసుని నొప్పించదలచలేదు కళ్యాణి. చల్లని పాలరాతి మీద, తెల్ల మల్లెల మీద నడిపించవలసిన ఉన్నతుడిని కటిక రాళ్ళతో తాడనం చేయడం మిక్కిలి క్రూరమైన చర్య. నవ్వుతూ అంది కళ్యాణి.

''మీ ఆలోచన సరియైనదే!''

అదే ఆమె చేసిన తప్పు.

తుంబురుని చేతిలో లోకాలను మృదు ధ్వనులతో వింపిన వీణ— నారదుని చేతిలో భక్తిరసాంబుధిని చిలికిన వీణ— త్యాగయ్య చేతిలో అజరామరమైన వీణ,— కళ్యాణికి ఒక ఖాళీ గుమ్మడికాయ, నాలుగు తుప్పు పట్టిన తీగల్లా కనపడుతున్నాయి.

తనకు వచ్చిన సంగీతానికి (అదే అనుకుంటే) సశాస్త్రమైన సంగీతానికి ఏమీ పొంతన లేదు.

ఇది చెప్పి ఎలా బాధించడం, ఈయన్ను. పింగాణీలాటి శ్రీ కళ్యాణ్ మనసు గాయపర్చడం ఎలా? మలిన పరచడం ఎందుకు?

ఆ సందిగ్ధ సమయంలో ఒక రోజు...

గుమ్మంలో అలికిడయితే చూసింది— ఎవరో ఆగంతకుడు.

''క్షమించండి మేడం— నా పేరు విద్యాధర్— టెక్నికల్ కాలేజీలో

మ్యూజిక్ లెక్చరర్ని— నా భార్య మోహిని కూడా నాతోపాటు అక్కడే పని చేస్తూవుంది— సంగీతానికి ఆవిడకూ పడదు— ఆవిడ క్లర్క్ అక్కడ...

మీ పెరటి వైపు, మా పెరటివైపు ఒకటే— నేను స్నానానికి నీళ్ళు కాచుకుంటూ వుంటే, మీ మంద్రస్థాయి రాగాన్ని విన్నాను. అణువు, అణువు చేర్చి మధుబందువును కూర్చి, రచించిన రాగాన్ని రుచి చూస్తే వచ్చే ఆనందమది. ఆ మాటే చెప్పిపోదామని వచ్చాను.

బిడియపడింది కళ్యాణి.

"రండి! లోపలికి!" అంది మర్యాదగా.

అతనూ ప్రవేశించాడు. ఆమె చల్లటి మజ్జిగ తెచ్చి ఇచ్చింది.

గ్లాసు అందుకుంటూ ఏదో 'హమ్' చేస్తున్నాడు విద్యాధర్.

"ఏంటి పాడుతున్నారు?"

"జయంతి శ్రీరాగంలో "మరుగేలరా! ఓ రాఘవా?" అని— విశ్వనాథ్ సినిమాలో జానకి అమృతం కురిపించింది— ఆ పాటలో" అన్నాడతను.

"మీరు పాడండి! మీకు బాగా వచ్చల్లేవుంది—" కళ్యాణి అంది గబుక్కున.

"కాని ఒక షరతు—" అన్నాడు విద్యాధర్—

"చెప్పండి—"

"మీరు తిరిగి పాడాలి—"

"నా ముఖం—" అంది కళ్యాణి.

"అయితే అసాధారణ అందంగా వుంటుంది— మీ పాట—" అన్నాడు. విద్యాధర్ పాట పాడాడు, తర్వాత...

ఆ పాటలో ప్రతి కదలికను, స్థాయిని, కెరటాల్లాటి హెచ్చుతగ్గుల్నో చక్కగా విన్నది కళ్యాణి.

పాట ఆగిన తర్వాత అప్రయత్నంగా మొదలుపెట్టింది—

"మరుగేలరా! రాఘవా—"

స్థాణువులా అయిపోయాడు విద్యాధర్!

పాట ఆగింది.



నవ్వు!

"మన ప్రక్కింటాయన చూడరా! కష్టసుఖాలలో కూడా నవ్వుతూ కనిపిస్తాడు!

"అవును మరి!... ఆయన టి.వి. ఎనౌన్సర్ కదా!"

—సాయిగంగాధర్ చామర్తి (విజయవాడ)

నిశ్చలంగా చూస్తున్న విద్యాధర్ కంటిలో తడి.

నిశ్శబ్దం అలుముకున్న ఆ గదిలో మొదట మాట్లాడాడు విద్యాధర్—

"అద్భుతం! సమ్మోహనం— శ్రావణి లాటి వజ్రం వుంది మీ గొంతులో సానబెడితే, సూర్య చంద్రులక్కర్లేదు— మీకేం పాటలు వచ్చు—"

"ఏవీ రావు— ఇప్పుడు పాడిందే పూర్తి పాట—"

కళ్యాణి నిరుత్సాహంగా అంది.

"కళ్యాణిగారూ! ఇంత విద్వత్తును ఇంటి పక్కన పెట్టుకుని, వెనెక్కడో, గవర్నమెంటు కాలేజ్‌లో, సిలబస్ పూర్తి చేయడం కోసం పాడడం అనుచితం. ఆసక్తి లేని పిల్లలకు సీసంలా నా సంగీతం పోస్తున్నానేమోనని నా సందేహం! పరీక్ష ధ్యేయంతో మా కాలేజీలో చేరే మొరటు మనుషులకు, జీతపు రాళ్ళకోసం బోధించడం సిగ్గు! సిగ్గు— నేను మీకు అన్నా నేర్పుతాను— మీరు అనుమతిస్తే—"

క్షణాల్లో కలసిపోతారు కొందరు— ఎన్నాళ్ళు పరిచయమున్నా బండరాళ్ళలా సమదూరంలో వుండిపోతారు చాలామంది.

మరువాటి నుంచి విద్యాధర్ కాలేజీ విడిచినప్పటి నుంచి కళ్యాణి ఇంట్లోనే సంగీత సాధన.

సాధనలో శ్రమ వుంది. కాని, ఈ సాధనలో సమృద్ధిగా తృప్తి వుంది.

త్యాగరాయకృతులు, రామదాసు కీర్తనలు, అష్టపదులు, కృష్ణలీలా తరంగిణి, దశావతార స్తుతి, అలవోకగా సాగిపోయాయి వారి మధ్య.

కళ్యాణి తన విద్యార్జన గురించి శ్రీ కళ్యాణ్‌కు చెప్పలేదు— అన్నీ నేర్చుకుని చెప్పవచ్చని యోచన కావచ్చు.

అతి సామాన్యమైన, ప్రమాదరహితమైన, మాటో, పనో, ఎన్నో ఘోరాలకు దారి తీయవచ్చు. జీవిత గమనాన్నే మార్చేయచ్చు. కళ్యాణికీ తట్టలేదు.

హరి కాంభోజలో "రామ నను బ్రోవరా, ప్రేమతో—" నాద చింతమణి రాగంలో "ఎన్నెట్లారాధించేదిరా" ఉదయచంద్రిక రాగంలో "ఎంత నేర్చిన ఎంత చూచినా, ఎంత వారలైనా కాంత దాసులే—" అని పాడినా, వారిద్దరిలో అంతర్గతంగా ఆనందమే తప్ప, వేరే ఆలోచన లేదు.

పసిమి రంగులో, గుమ్మడి పువ్వులా వున్న కళ్యాణి, విశాలమైన బాహువులతో వటవృక్షంలా వున్న విద్యాధర్‌లోగాని, కల్మష కిల్మషాలకు తావులేదు. ఒక వీణ, ఒక సారంగి ప్రక్క ప్రక్కనే వుంటే, వాటి మధ్య ఏసంబంధం వుంటుంది?

కాని—

ఆ రోజు అలా జరగక పోయుంటే, కళ్యాణి, శ్రీ కళ్యాణ్‌ని ఆశ్చర్యపరిచి, ఆనందపరిచేదే!

ఆ దుర్ఘటన జరిగేది కాదు!!

మధ్యాహ్నం. విద్యాధర్ కాలేజీ నుంచి వచ్చాడు. అతని భార్య మోహినికి కుదరదు. ఆమె ఆఫీసులో పని చేస్తుంది. కళ్యాణ్ ఎప్పుడూ సూర్యాస్తమానం అయిన తర్వాతే వస్తాడు.

కళ్యాణి ఇచ్చిన చల్లని పానీయం తాగి

విద్యాధర్ అభేరి రాగంలో "నగుమోము గనలేని..." పాట కళ్యాణికి నేర్పుతున్నాడు.

"టక్—టక్—" తలుపుమీద చప్పుడు—
"కళ్యాణీ— తొందరగా తలుపు తెరు—"

ఉలిక్కిపడ్డాడు విద్యాధర్—

"మీవారు—"

"అవును"

"ఇప్పుడెలా?..."

"వెనకవైపు నుండి మీ పెరట్లోకి వెళ్ళవచ్చుగా—"

"అలాగే— నే వెళ్ళిన తర్వాత తలుపు తెరవండి—"

...

...

...

కళ్యాణి తలుపు తెరిచింది. "కళ్యాణీ! అర్జంటుగా రైలుకెళ్ళాలి. అందుకే వచ్చాను. బట్టలు సర్దుకుని, పది నిమిషాల్లో స్టేషనులో వుండాలి—"

స్వచ్ఛమైన స్ఫటికంలాటి మనసు శ్రీ కళ్యాణ్ ది.

ఆలస్యమైందేమని అడగలేదు.

అయిదు నిమిషాల్లో అతను వెళ్ళిపోయారు.

అతను వెళ్ళిన తర్వాత కళ్యాణి అదిరిపడింది. ఏమిటి తాను చేసింది? తప్పు చేసిన దానిలా ఎందుకలా చేసింది?


హిమవన్నగం నుంచి ఒక్కసారి అధోలోకాల్లోకి దిగజారిన భావన!

ఛి..ఛీ— ఎందుకిలా చేసింది? మానసిక సంఘర్షణ— తప్పు చేయకపోయినా, తప్పు చేసిన దానిలా— మనసులో ఏ దుష్టయోచనా లేదని ధయిర్యంగా ఎలా చెప్పగలదు? ఎందుకలా జరిగింది?

శ్రీ కళ్యాణ్ నాలుగురోజుల వరకూ రాలేదు. ఆ తర్వాత రెండు రోజులూ, కళ్యాణి తలుపు తెరవలేదు. తీవ్ర మనస్తాపంతో అన్నపానాదులు మానేసింది.

ఎవరు తన్ను శిక్షించేది ఈ తప్పుకు.

## నక్షత్రాల మరణం



మనుష్యుల్లాగే నక్షత్రాలకి పుట్టుక, చావు ఉన్నాయంటే ఆశ్చర్యంగా ఉంటుంది.
ఎటొచ్చీ మనిషి వందేళ్ళు బ్రతికితే నక్షత్రాలు మిలియన్ల కొద్దీ సంవత్సరాలు బ్రతికి ఉంటాయి.?

—శౌరవి

శ్రీ కళ్యాణా? తెలిస్తే కదా? దేముడా? ఎక్కడున్నాడో? ఎప్పుడు వస్తాడో? దేముడి కాలమానం ప్రకారం మన వందేళ్ళూ ఆయనకు క్షణంలో సహస్రాంశం కదా! మరి తనువు ముగిసిన తర్వాతే ఆయన నిర్ణయం!

మరి!

ఒక నిర్ణయానికొచ్చింది ఆమె.

నాలుగు రోజుల తర్వాత తిరిగొచ్చిన శ్రీ కళ్యాణ్‌కు ఖాళీ ఇల్లు ఎదురయింది.

డ్రెస్సింగు టేబులు మీద కళ్యాణి ఉత్తరం!

"ప్రియ శ్రీ కళ్యాణ్!

నేను తప్పు కాని తప్పు చేసాను— నన్ను నేనే క్షమించుకోలేని తప్పు— మూడు నిర్దయమైన క్షణాలు నన్నలా చేయించాయి. నేనే ముద్దాయిని— నేనే న్యాయమూర్తిని— నా శిక్ష— క్షణానికో నెల చొప్పున మూడు నెలలు నన్ను మీకు దూరం చేసుకుంటున్నాను— ఇల్లు తప్పు చేసీ చేయని మీ ఇల్లాలు—"

ఏదో రైలు ఎక్కి, నిర్మానుష్యంగావున్న "మలయవనం"లో దిగింది.

చిన్న గ్రామం... మూడు నెలలు విశ్రాంతిగా వుండాలని వచ్చానని చెప్పింది గ్రామ పెద్దకు. కాలక్షేపం కోసం పిల్లలకు పాఠాలు చెప్పింది. ఆ పాఠాలలో ఆ పిల్లలకు ఆసక్తి లేదు— పెద్దలకూ లేదు— మూడు నెలలేగా అని కళ్యాణి అంతగా పట్టించుకోలేదు.

మూడు నెలల తర్వాత ఉత్తరం రాసింది —శ్రీ కళ్యాణ్‌కు—

"నా శిక్ష ముగిసింది— నన్ను క్షమిస్తే "మలయవనం" రండి— ఉత్తరం రాసిన మూడో రోజు మంచే స్టేషనుకు వచ్చింది.

పురుషోత్తముడిలాటి తన భర్త ఈ రోజు వస్తాడు! మరి రేపు— ఆ తర్వాత? రాలేదు— మరో రోజు! మరో రోజు—

కనీసం కన్నతండ్రి. భర్త క్షమించకపోతే, విషయం తెలిసి తండ్రయినా రాడా?

ప్రతీరోజూ నిరీక్షణ! రోజులు? నెలలూ

పిల్లలకు పాఠాల మీద శ్రద్ధ పుట్టింది... కళ్యాణికి వేరే దారి లేదు.

గడిచిపోయిన కాలాన్నీ, జరిగిన ఘటననూ, పునరావృతం చేసుకుంటూ కళ్యాణి ఉళ్లోకొచ్చేసరికి బాగా చీకటి పడిపోయింది.

చీకటి చీర చుట్టుకున్న పర్వతాలు మౌనంగా వున్నాయి. కీచురాళ్ళ ధ్వనుల మధ్య వాటి రోదన వినపడదు. అదీ మౌన రోదన.

"లేదు. లేదు— నా కళ్యాణ్ అలాటివాడు కాదు— అవునేమో— మూడు నెలలు దాటిపోయి చాలా రోజులయింది. తను స్వయంగా విధించుకున్న శిక్ష చాలలేదా! కళ్యాణ్ దృష్టిలో తవింకా దోషియేనా? అగ్నిపునీత సీతలా, తన అంతర్వేదనతో తాను పునీత కాలేదా? మరి తండ్రీ? పెళ్ళయిన ఆడపిల్ల విషయంలో ఆయన పట్టించుకోకూడదనుకున్నాడా? అందరూ అంతేనా? తనను ప్రాణంలా చూసుకునే వాడే?

ఎన్నాళ్ళీ నిరీక్షణ? ఏదీ మార్గం?

మూడు క్షణాల తప్పుకాని తప్పు చేసి,

తనమీద వుంచిన నమ్మకాన్ని వమ్ము చేసిన తను, మూడు నెలలే శిక్ష ఎందుకు విధించుకుంది. మూడేళ్ళు కావచ్చు కదా! పోనీ ముప్పయి ఏళ్ళు?

మాగన్నుగా నిద్రపడుతున్న వేళ ఆమె ఒక నిశ్చయానికొచ్చింది. మొదలు, చివరా అనేది లేదు తన నేరానికి. శిక్షాస్మృతి లేదు. న్యాయం ఎవరూ చెప్పలేరు. కాలమానాలు వేరయినా దేవతలు చెప్పలేరు?

తెలవారుతూండగా లేచింది.

మధ్యాహ్నం వరకూ అన్యాపదేశంగా పిల్లలకు పాఠాలు చెప్పింది?

ఇప్పుడు శ్రీ కళ్యాణ్ ఏం చేస్తూ వుంటాడు?

విద్యాధర్, మోహినీ!

ప్రొద్దువాటారుతున్న సమయంలో రైల్వేస్టేషనుకు వచ్చింది.

పొగలు చిమ్ముతూ వచ్చింది రోకటిబండలా మెల్లిగా పాకుతూ రైలు.

ఈ ఆఖరి నిరీక్షణ అవసరం!

తనను శ్రీ కళ్యాణ్ క్షమించినట్టులేదు — విద్యాధర్ అంతా చెప్పివుంటాడు? ఆయనేదో వూహించుకుంటే— తప్పులేనిదే ఎందుకు పారిపోయిందనుకుంటే—

రైలు ఆగకముందే కళ్యాణి పట్టాలు దాటింది— ఆ తర్వాతంతా చిట్టడవి— ఆ తర్వాత మనుషులు ప్రవేశించలేని కీకారణ్యం!

నెమ్మదిగా నడుస్తూ వుంది అడవిలోకి— నెమ్మదిగా— వేగంలేని ప్రయాణమే! అంతంలేని ప్రయాణం!! తిరిగి రాలేని ప్రయాణం!!! మెల్లిగా పాడుకుంటూ వుంది?

అన్యాయము సేయకురా— నన్యునిగా జూడకురా

ఎన్నో తప్పులు గలవారిని, రాజన్య నీవు బ్రోచినావు!

ఆ ప్రార్థన అరణ్య రోదనమని ఆమెకు తెలుసు— మనుషుల క్షణభంగుర జీవితంలో భగవానునికి కాపాడే సమయమేది? ఆయన క్షణమే మన పది జన్మల పెట్టు.

అలా నడిచి నడిచి కళ్యాణి చెట్టులో చెట్టుగా, తీగలో తీగలా కలిసిపోయింది—

** ** **

ఆ సాయంత్రం—

గ్రామ పెద్ద ఇంటి దగ్గర శ్రీ కళ్యాణ్!

"నిన్ననే అందింది వుత్తరం! ఏదీ కళ్యాణి! ఈ ఉత్తరం చదివిన తర్వాత కొండంత ఆశ కల్గింది! నా కళ్యాణి ఈ యుగంలో పుట్టాల్సింది కాదు. పోస్టల్ డిలే!— ఆలస్యం అయింది—"

కళ్యాణి నివసించిన గుడిసె ఖాళీగా శ్రీ కళ్యాణ్‌కు మౌనంగా జవాబు చెప్పింది.

